క్లుప్తంగా

రాజగోపురానికి రూ. 50 వేలు విరాళం



దాతలకు స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: మండల పరిధిలోని ఉరుకంద గ్రామంలో వెలసిన ఈరన్న స్వామి ఆలయ రాజగోపుర నిర్మాణానికి శుక్రవారం భక్తుడు రూ. 50,000 విరాళంగా అందజేసినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వాణి తెలిపారు. బెంగళూరుకు చెందిన తుంబలం గుత్తి గోవిందశెట్టి, శకుంతల దంపతులు జ్ఞాపకార్థం వారి కుమారుడు, కోడలు విరాళాన్ని అందజేసినట్లు తెలిపారు. దాతలకు ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.

ప్రభుత్వానికి నివేదిక పంపుతాం

పెద్దకడబూరు: పంట నష్టపరిహారం మంజూరుకు ప్రభుత్వానికి నివేదిక పంపుతామని కడప విత్తనాభివృద్ధి సంస్థ మేనేజర్ జగదీష్, ఆదోని వ్యవసాయ సంచాలకులు ఎం.గిరీష్‌లు తెలిపారు. 2022 రబీ సీజన్‌లో ఆంధ్రప్రదేశ్ విత్తనాభివృద్ధి(ఏపీఎస్‌ఎస్‌డీఎస్) సంస్థ నుంచి తీసుకున్న రాయితీ వేరుశనగ విత్తనాలు సరిగా మొలకెత్తలేదని మండల పరిధిలోని మేకడోణ గ్రామ రైతులు వ్యవసాయాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మండల వ్యవసాయాధికారి వరప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం వారు వేరుశనగ పంటలను పరిశీలించారు. వేరుశనగ పంట సరిగా మొలకెత్తలేదని గుర్తించారు. రైతులు నష్టపోయిన విషయం వాస్తవమేనని ఇదే విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిహారం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. వారి వెంట క్షేత్ర సహాయకులు శ్వేత, సాయి ఉన్నారు.

సర్దుబాటు పేరుతో ఇబ్బంది పెట్టొద్దు



మాట్లాడుతున్న ఎస్టీయూ నాయకుడు హనుమన్న

ఆదోని అర్బన్: పని సర్దుబాటు పేరుతో సంక్రాంతి పండుగ పూట ఉపాధ్యాయులను ఇబ్బంది పెట్టొద్దని ఎస్టీయూ సీనియర్ నాయకుడు హనుమన్న, జిల్లా కార్యదర్శి నాగేంద్రప్ప ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. పదోన్నతుల ప్రక్రియలను చేపట్టాలని కోరారు. ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరత పేరుతో నియమ, నిబంధనలు పాటించకుండా చేస్తున్న పని సర్దుబాటును తక్షణమే రద్దు చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు శ్రీనివాసులు, తిమ్మప్ప,జ్యోతిమూర్తి,నాగమణి పాల్గొన్నారు.

25న ఉరుకుందలో బహిరంగ వేలం

కౌతాళం:ఈనెల 25న ఉరుకుందలో వివిధ పనులకు బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వాణి, ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ స్వామి వారికి భక్తులు సమర్పిస్తున్న కలగలపు బియ్యం బ్యాళ్లను పాగు చేసుకునే హక్కు కోసం, లగేజీతో పాటు సెల్ ఫోన్లు భద్రపరుచుకోవడానికి, స్వామి పూజల కోసం పూలు, వస్త్రాలు సమకూర్చేందుకు, కార్యాలయానికి కావాల్సిన ప్రింటింగ్ బుక్స్, ఎలక్ట్రికల్ మెటీరియల్స్, సులభ్ కాంప్లెక్స్ మెంటెనెన్స్ తదితర వాటికి వేలం నిర్వహించనున్నామన్నారు.

నిబంధనలు పాటించాలి

ఆదోని అర్బన్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని టూటౌన్ సీఐ శ్రీనివాసనాయక్ సూచించారు. శుక్రవారం రాత్రి 8 గంటల సమయంలో వాహనదారులతో మాట్లాడారు. మోటార్ సైకిళ్లపై ప్రయాణించే వారుహెల్మెట్, కార్లలో ప్రయాణించే వారు సీటు బెల్ట్ ధరించాలన్నారు. రోడ్డు ప్రమాదాలకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

బూదూరులో అవగాహన సదస్సు

మంత్రాలయం రూరల్: మండల పరిధిలోని బూదూరు గ్రామంలో శుక్రవారం రాత్రి ఎస్‌ఐ వేణుగోపాల్‌రాజు అవగాహన సదస్సు నిర్వహించారు. బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సోదరభావంతో మెలగాలని, గొడవలకు తావు లేకుండా జీవించాలని సూచించారు.

మంత్రాలయం చేరుకున్న కన్నడిగుల పాదయాత్ర

మంత్రాలయం రూరల్: కర్ణాటక రాష్ట్రం బెళగావి జిల్లా చిక్కోడికి చెందిన 180 మంది భక్తులు శుక్రవారం రాత్రి పాదయాత్రగా మంత్రాలయం చేరుకున్నారు. వీరు ముందుగా గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీ రాఘవేంద్రస్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు పాదయాత్రగా రావడం తమ అనవాయితీగా వస్తుందని భక్తబృందం సభ్యులు తెలిపారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు

- ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి



పీకలబెట్టలో మహిళలకు సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

మంత్రాలయం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందించామని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పెద్దకడబూరు మండలం హులికన్వి, పీకలబెట్ట గ్రామాల్లో శుక్రవారం పర్యటించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్ కుమార్‌రెడ్డితో కలిసి ఇరు గ్రామాల్లో 328 ఇళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పాలకులు తలదించుకునేలా పాలన సాగించడంలో జగనన్న సక్సెస్ అయ్యారన్నారు. గాంధీజీ కలలు కన్న పాలన జగనన్న విషయంలో సాధ్యపడిందన్నారు. సచివాలయ వ్యవస్థతో ప్రజల వద్దకు పాలన తీసుకువచ్చారన్నారు. జగనన్న పాలనలో ఏ పథకం కావాలన్నా సొంత ఊరిలోనే పరిష్కారం దొరుకుతుందన్నారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా సాగిస్తున్న పాలనపై ప్రజలంతా సంతృప్తికరంగా ఉన్నారన్నారు. రాబోయే ఎన్నికల్లోనూ తమ పార్టీ విజయం ఖాయమన్నారు. అనంతరం పీకలబెట్ట గ్రామంలో సచివాలయం ఉద్యోగులతో సమావేశమయ్యారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రతి అధికారి, వలంటీర్ పని చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామ్మోహన్‌రెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రఘురామ్, ఉరుకుంద ట్రస్టు బోర్డు మెంబర్ విజయేంద్రరెడ్డి, నాయకులు గజేంద్రరెడ్డి, శివరామిరెడ్డి, సర్పంచు మూలింటి లక్ష్మి, పంచాయతీరాజ్ ఏఈ మల్లయ్య, ట్రాన్స్‌కో ఏఈ గజవేంద్రం, ఏపీఎం మల్లికార్జునప్ప, ఏపీఓ రామన్న, ఎస్‌ఐ శ్రీనివాసులు, ఆర్‌ఐ మహేష్ పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రాన్ని వినియోగించుకోండి



మాట్లాడుతున్న వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు పి.మురళీమోహన్ రెడ్డి

కోసిగి: రైతు భరోసా కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలని వ్యవసాయ సలహా మండలి మండల అధ్యక్షుడు పి. మురళీ మోహన్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి రాజు సూచించారు. శుక్రవారం కోసిగిలోని స్త్రీ శక్తి భవన కార్యాలయంలో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయానికి సంబంధించిన సమస్యలు, పంటల సాగుపై సలహాలు, సూచనలు ఇవ్వడానికి రైతుభరోసా కేంద్రం విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్స్ అందుబాటులో ఉంటారన్నారు. అలాగే సబ్సిడీ ధరలకు ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ పనిముట్లు డ్రోన్ ద్వారా పంటలకు పిచికారీ చేసే యంత్రాలు అందుబాటులో ఉన్నాయని, ఆసక్తి ఉన్న రైతులు కొనుగోలు చేసుకోవచ్చనన్నారు. సమావేశంలో ఎంపీపీ ఈరన్న, వ్యవసాయ సలహా మండలి ఉపాధ్యక్షులు బెట్టన గౌడ, గౌరవ సభ్యులు రామలింగప్ప, పరుశురాముడు, రమేష్, మూకయ్య, దేవి, బసిరెడ్డి, రైతులు, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్స్‌లు పాల్గొన్నారు.



అలనాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

అ‘పూర్వ’ కలయిక

కృష్ణగిరి: ఇరవై ఏళ్ల క్రితం వీడ్కోలు చెప్పుకున్న వారందరూ శుక్రవారం కలుసుకున్నారు. మిత్రమా ఎలా ఉన్నావ్.. ఏమి చేస్తున్నావంటూ ఆప్యాయంగా పలకరించుకున్నారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను నెమరేసుకుంటూ సంతోషంగా గడిపారు. కృష్ణగిరి మండలం కంబాలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2002–03 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు స్థానిక పాఠశాలలో సమావేశమయ్యారు. పాఠశాల అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని నిర్ణయించుకున్నారు. ఏటా పదో తరగతిలో పదికి పది పాయింట్లు సాధించే పేద విద్యార్థులకు ఆర్థికసాయం అందిస్తామని ప్రకటించారు. అనంతరం అతిథులుగా హాజరైన గురువులు వెంకటసుబ్బారెడ్డి, శివశంకరయ్య, యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేష్, సుబ్బరాయుడు, శ్రీనివాసరెడ్డి, నాగరాజు, రేణుక, చంద్రావతి, వీణా, నాగమంజులు, వార్డెన్ వెంకటరావ్‌లను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్థులు రవికుమార్, రాఘవేంద్రగౌడ్, వీరభాస్కర్, జయరామ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ మృతదేహం లభ్యం



లక్ష్మి మృతదేహం

ఆలూరు రూరల్: ఎల్‌ఎల్‌సీ కాలువలో గల్లంతైన లక్ష్మి (30) శుక్రవారం విగతజీవిగా మారింది. హాలహర్వి మండలంలోని పచ్చారపల్లి గ్రామం సమీపంలోని ఎల్‌ఎల్‌సీ కాలువలో లక్ష్మి మృతదేహాన్ని గుర్తించారు. లక్ష్మికి ఆలూరు మండలం హత్తిబెళగల్ గ్రామానికి చెందిన వీరభద్రితో 13 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి నలుగురు ఆడపిల్లలు సంతానం. గురువారం కర్ణాటక రాష్ట్రం ఎర్రగుడి సమీపంలోని తన ఇద్దరు కూతుళ్లతో సహా ఎల్‌ఎల్‌సీ కాలువలో దూకగా ఏడాది పాప శాంతి మృతిచెందగా లక్ష్మి గల్లంతైది. వెన్నెల అనే బాలిక ప్రాణాలతో బయటపడింది.

అన్నదమ్ముల మధ్య ఘర్షణ

ఆస్పరి:మండలంలోని ములుగుందం గ్రామంలో పొలం గట్టు విషయంపై గురువారం రాత్రి ఇద్దరు అన్నదమ్ములు ఘర్షణ పడ్డారు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. మునిస్వామి, రంగస్వామి అన్నదమ్ములు. వీరి మధ్య కొంత కాలంగా పొలం గట్టు విషయమై తగాదా నెలకొంది. గురువారం రాత్రి మునిస్వామి భార్య, కొడుకు, కోడలు కలిసి రంగస్వామి,అతని కుటుంబ సభ్యులు సునిత,గణేష్‌పై కర్ర లతో దాడికి పాల్పడ్డారు. తీవ్రగాయాలు కావడంతో కర్నూలు ఆసుపత్రికి తరలించారు. ఇరువురిపై కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్‌ఐ వరప్రసాద్ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో కుంభోత్సవం

హొళగుంద: మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలో వెలసిన దుర్గమ్మ దేవి మేటి కుంభోత్సవాన్ని శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామ శివారులో వెలిసిన అమ్మవారికి గురువారం గంగిపూజ నిర్వహించిన గ్రామస్తులు శుక్రవారం తెల్లవారుజామున కుంభాన్ని ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకెళ్లారు. జలాభిషేకాలు, ఆకుపూజ, మహా మంగళహారతి, నైవేద్య సమర్పణ తదితర పూజలు నిర్వహించారు. పూజల్లో దేవరగట్టు ఆలయ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు పాల్గొన్నారు.

రీ సర్వే వంద శాతం పూర్తి చేస్తాం

కౌతాళం: జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం కింద రీ సర్వే వందశాతం పూర్తి చేస్తామని ఇన్‌చార్జ్ తహసీల్దారు రామేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రీ సర్వేతో శాశ్వత హక్కు పత్రాలు పొందవచ్చన్నారు. ఇప్పటికే మండలంలోని ఆరు గ్రామాల్లో రీ సర్వే పూర్తి అయి రైతులకు భూ హక్కు పత్రాలను అందజేశామన్నారు. ప్రస్తుతం 21 గ్రామాల్లో సర్వే జరుగుతున్నదని మరో 7 గ్రామాల్లో ఫిబ్రవరి, మార్చిలో సర్వే ప్రారంభిస్తామన్నారు. భూ హక్కు ప్రతాలు పొందిన రైతులు తప్పులుంటే అర్జి పెట్టుకోవాలని ఏడాదిలోపు సవరణ చేసి నూతన భూ హక్కు పత్రాలు అందజేస్తామన్నారు.

అంబేడ్కర్ విగ్రహం వద్ద అభివృద్ధి పనులు

కౌతాళం: మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఫ్లోరింగ్ పనుల్ని వైఎస్సార్‌సీపీ నాయకుడు దేశాయ్ ప్రహ్లాదచారి ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ పాల్‌దినకర్, ఉప సర్పంచ్ తిక్కయ్య, వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, మాజీ సర్పంచ్ అవతారం పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి నగదును అందజేస్తున్న దృశ్యం

కోసిగి: మండల కేంద్రంలోని వైఎస్సార్ సర్కిల్‌లో నివాసం ఉంటున్న సూరుపోగు అనుమేష్ (26) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. నిరుపేద కుటుంబం కావడంతో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ మురళీ మోహన్ రెడ్డి సహకారంతో మృతుడి కుటుంబ సభ్యులకు రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. నగదును ఆర్లబండ సహకార సంఘం అధ్యక్షుడు మహంతేష్ స్వామి, వైఎస్సార్ సీపీ గ్రామ నాయకుడు రాజేష్ చేతుల మీదుగా నగదుకు కుటుంబ సభ్యులకు అందించారు. అలాగే వైఎస్సార్ బీమా పథకం కింద అంత్యక్రియలు నిమిత్తం రూ.10 వేలను పంచాయతీ కార్యదర్శి అనురాధ అందజేశారు.

హోరాహోరీగా క్రికెట్ పోటీలు

కృష్ణగిరి: దివంగత చెరుకులపాడు నారాయణ రెడ్డి జ్ఞాపకార్థం మండల కేంద్రంలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. శుక్రవారం జరిగిన పోటీలో బాపనదొడ్డిపై కృష్ణగిరి జూనియర్ జట్టు, చెరుకులపాడుపై వెల్దుర్తి, రామకృష్ణాపురంపై కృష్ణగిరి సీనియర్ జట్టు గెలిపొందినట్లు నిర్వాహకులు మహేష్, శివారెడ్డి, మనోహర్, హరీష్‌రెడ్డి తెలిపారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి





ఎమ్మిగనూరు జట్టుకు రూ.లక్ష, ట్రోఫీని అందిస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి , మొదటి బహుమతి సాధించిన చెట్నేపల్లె జట్టుకు ట్రోఫీ అందిస్తున్న ఎర్రకోట

- వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి
- ముగిసిన అంతర్రాష్ట్ర క్రీడలు

ఎమ్మిగనూరుటౌన్: గెలుపోటములను సమానంగా స్వీకరించాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి సూచించారు. శుక్రవారం రాత్రి నీలకంఠేశ్వర స్వామి జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన క్రీడా పోటీల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి క్రీడలతో స్నేహసంబంధాలు మెరుగుపడతాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, ఆర్గనైజర్ విశ్వనాథ్ రమేష్, రామకృష్ణ, ఫుట్‌బాల్ కోచ్ మాబుసాహెబ్, జిల్లా వక్ఫ్‌బోర్డు ఉపాధ్యక్షుడు రియాజ్‌అహమ్మద్, వైఎస్సార్‌సీపీ నాయకులు యూకే రాజశేఖర్, సునీల్‌కుమార్, షబ్బీర్‌అహమ్మద్, కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ విజేత ఎమ్మిగనూరు

వైఎస్సార్ అంతర్రాష్ట్ర ఫుట్‌బాల్ పోటీల్లో ఎమ్మిగనూరు జట్టు విజేత కేతనం ఎగురవేసింది. నీలకంఠేశ్వర స్వామి జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన క్రీడా పోటీలు ఐదు రోజుల పాటు ఎంతో ఉత్సాహంగా సాగాయి. చివరిరోజు శుక్రవారం ఉడిపి జట్టుపై ఎమ్మిగనూరు జట్టు విజయం సాధించి రూ.లక్ష నగదుతో పాటు ట్రోఫీని గెలుచుకుంది. ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన మహిళా కబడ్డీ పోటీల్లో తమిళనాడు జట్టు విజేతగా నిలిచి రూ.50 వేలు గెలుచుకుంది. వాలీబాల్ పోటీలో చెట్నేపల్లె బి.జట్టు ప్రథమ స్థానంలో నిలిచి రూ.40,116 నగదు బహుమతి దక్కించుకుంది. ఇక ఫుట్‌బాల్, కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో రెండో స్థానాల్లో నిలిచిన ఉడిపి, హర్యాణా, చెట్నేపల్లె ఎ.జట్లు వరుసగా రూ. 50 వేలు, రూ.30 వేలు, రూ.30,116ల నగదు బహుమతులు దక్కించుకున్నాయి.

క్రీడా దుస్తుల అందజేత

స్థానిక ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న వైఎస్ఆర్ అంతర్ రాష్ట్ర మహిళా కబడ్డీ క్రీడాకారిణిలకు శుక్రవారం మేఘన స్పోర్ట్ ఆధ్వర్యంలో వీరారెడ్డి, డాక్టర్ మల్లెల గ్రూప్స్ అధినేత మల్లెల ఆల్‌ఫ్రెడ్‌రాజు క్రీడాదుస్తులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్గనైజర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



జలగారివీధిలో స్థానికులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

మరోసారి జగనన్నను దీవించాలి

- ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని అర్బన్: ప్రభుత్వ సంక్షేమ పథకాలు కొనసాగాలంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి దీవించాలని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి కోరారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలో 4వ వార్డు శక్తిగుడి, గౌళీపేట, జలగారివీధిలో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పింఛన్‌రావడం లేదని కొందరు, మధ్యలో తొలగించారని మరికొందరు విన్నవించగా లోపాలను సరిచేసి పింఛన్ మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటానని వారికి ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అవ్వాతాతలను, అక్కాచెల్లెమ్మలను ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతుండటాన్ని చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్ జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. ఎన్ని పార్టీలు ఏకమైనా ప్రజల ఆశీస్సులు ఉన్నంతవరకు జగన్ ముఖ్యమంత్రిగానే కొనసాగుతారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ మధుసూదన్, యార్డు వైస్ చైర్మన్ కామాక్షి తిమ్మప్ప, ఆయా కార్పొరేషన్ డైరెక్టర్‌లు రేణుక, మంజుల, మస్తాన్, సలీం, ధర్మన్న, వైఎస్సార్‌సీపీ పట్టణ గౌరవాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, అధ్యక్షులు దేవా, కౌన్సిలర్లు చలపతి, చిన్నా, మహేశ్వరి, ఆనంద్ పాల్గొన్నారు.

సజావుగా అంగన్‌వాడీ ఇంటర్వ్యూలు



అభ్యర్థులను ఇంటర్వ్యూ చేస్తున్న సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ఆదోని రూరల్:డివిజన్ పరిధిలోని అంగన్‌వాడీ ఆయా, కార్యకర్తల పోస్టులకు శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ తన కార్యాలయంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ కె.ఎల్.ఆర్.ఎ. కుమారి, డిప్యూటీ డీఎంహెచ్ సత్యవతి ఆధ్వర్యంలో అభ్యర్థులను ఇంటర్వ్యూ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలు పోస్టులు 9 ఖాళీలు ఉండగా 28 మంది, 37 ఆయా పోస్టులకు 124 మంది అభ్యర్థులు హాజరయ్యారన్నారు. కార్యక్రమంలో ఆదోని రూరల్ సీడీపీఓ నిర్మలదేవి, అర్బన్ ఉమామహేశ్వరి, ఎమ్మిగనూరు సీడీపీఓ సఫర్నీషా బేగం పాల్గొన్నారు.

అటెండర్ సస్పెన్షన్‌పై విచారణ



విచారణ చేస్తున్న జెడ్పీ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి

ఆదోని రూరల్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అటెండర్ రాజశేఖర్‌పై ఉన్నతాధికారులు సస్పెన్షన్ విధించారు. ఈ విషయంపై శుక్రవారం జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకుని విచారణ చేపట్టారు. అటెండర్ రాజశేఖర్ విధులకు గైర్హాజరవుతుండడంపై ఎంపీడీఓ గీతావాణి గత ఏడాది సెప్టెంబర్‌లో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో సస్పెన్షన్ వేటు వేశారు. అటెండర్ ప్రవర్తనపై విచారణ చేశామని నివేదికను సీఈఓకు అందజేస్తామని డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి తెలిపారు. విచారణలో ఎంపీడీఓ గీతావాణి, సూపరింటెండెంట్ విజయశేఖర్‌రావు, సీనియర్ అసిస్టెంట్ వీరభద్రయ్య పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



మాట్లాడుతున్న సర్పంచ్ అయ్యమ్మ

కోసిగి: అభివృద్ధిలో వార్డు మెంబర్లు భాగస్వాములు కావాలని సర్పంచ్ కుమారి సంజిపోగు అయ్యమ్మ సూచించారు. శుక్రవారం కోసిగి పంచాయతీ కార్యాలయంలో వార్డు మెంబర్లుతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటికే సీసీ రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేశామన్నారు. తాగునీటి సమస్య లేకుండా పులికనుమ, దుద్ది రిజర్వాయర్ల సమీపంలో ప్రత్యేక బోర్లు వేయించి నీటి సరఫరా చేయిస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే జల జీవన్ మిషన్ కింద ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేయిస్తున్నట్లు తెలిపారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా ప్రజలను చైతన్యం చేయాలన్నారు. చెత్త చెదారాన్ని పంచాయతీ వాహనం వచ్చినప్పుడే వారికి అందజేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు మాణిక్యరాజు, పంచాయతీ కార్యాలయం బిల్లు కలెక్టర్ గాయత్రీదేవి పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు



జేసీబీతో మరమ్మతులు చేస్తున్న నాయకులు

ఆదోని రూరల్: మండిగిరిలోని భరత్‌నగర్ కాలనీలో రోడ్డు మరమ్మతులను శుక్రవారం వైఎస్సార్‌సీపీ నాయకులు కడతోట ఈరన్న, తురువగల్ రాజు, ఈరన్న చేపట్టారు. రోడ్డు సమస్యను స్థానికులు జిల్లా కార్యదర్శి శేషిరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన ఎమ్మెల్యే బాలనాగిరెడ్డికి చేరవేశారు. ఎమ్మెల్యే ఆదేశాలతో నాయకులు పనులకు ఉపక్రమించారు.

రోడ్డు భద్రతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న తాలూకా ఎస్‌ఐ గోపాల్‌రెడ్డి

ఆదోని రూరల్: మండలంలోని నెట్టేకల్ క్రాస్ రోడ్డు వద్ద శుక్రవారం సాయంత్రం తాలూకా ఎస్‌ఐ గోపాల్ రెడ్డి రోడ్డు భద్రతపై వాహనదారులు, ప్రజలకు అవగాహన కల్పించారు. వాహనదారులు తప్పకుండా రికార్డులు, డ్రైవింగ్ లైసెన్సు, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలన్నారు. మద్యం తాగి డ్రైవింగ్ చేయరాదన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

కృష్ణగిరి: సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామాల్లో కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ చంద్రశేఖర్‌రెడ్డి హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పేకాట తదితర వాటిపై అన్ని గ్రామాల్లో నిఘా పెంచామన్నారు. అన్ని గ్రామాల్లో పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. గ్రామాల్లో పేకాట, కోడి పందేలు నిర్వహిస్తే పోలీసులకు సమాచారం అందిస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

పత్తి ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం



అగ్నికి ఆహుతైన పత్తి

ఆదోని అర్బన్: స్థానిక బసాపురం రోడ్డులోని సంతోష్ జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ ఫ్యాక్టరీలో శుక్రవారం రాత్రి అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. జిన్ను నడుస్తుండగా మిషన్ షార్ట్‌సర్క్యూట్ అయ్యి నిప్పులు చెలరేగి పత్తికి మంటలు వ్యాపించాయిన ఫ్యాక్టరీ యజమాని ప్రశాంత్ తెలిపారు. హమాలీలు వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు.